## నారాయణలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



**నెల్లూరు, మే 27, ప్రభాతవార్త -విద్య** నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో ఆ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కోడింగ్ కాంపిటేషన్‌లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా వారందరిని పొంగూరు నారాయణ అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. సుమారు ఆరు వందల మందితో ఎలక్షన్‌కి ముందు మహిళా వింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరంతా ఎన్నికల్లో చాలా కష్టపడి పని చేశారని తెలిపారు. మహిళా శక్తి టీఎం సభ్యులకి ఏ రంగంలో ఇంట్రెస్ట్ ఉందో దాంట్లో వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా వారికి ఐటీ ఉద్యోగాలు కానీ హాస్పిటల్‌లో కానీ బిజినెస్‌లలో కానీ పలు కంపెనీల్లో వారికి ఉద్యోగాలు వచ్చే విధంగా చేస్తానని ఎన్నికలకు ముందే చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని ఎన్నికల్లో ప్రారంభించాలని అనుకున్నానని కానీ ఎలక్షన్‌లో అందరూ బిజీగా ఉంటారన్న ఉద్దేశంతో ఎలక్షన్ అయిన తరువాత ప్రారంభిస్తామని చెప్పారన్నారు. ఈ రోజు నుంచి 30 మందిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఒక బ్యాచ్, అదే విధంగా సాయంత్రం 3 గంటల నుంచి 7 గంటల వరకు ఇంకో బ్యాచ్‌కి బేసిక్స్ చెప్పే విధంగా ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, డిపార్ట్‌మెంట్ వారు దీనిని డిజైన్ చేశారని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గతంలో నా దగ్గర ఆఫీస్ బాయ్‌లుగా పని చేసిన వాంరెందరో ఆమెరికాలో ఉన్నారని గుర్తు చేశారు. మహిళలందరూ స్కిల్ డెవలప్మెంట్‌ని బాగా అవగాహన చేసుకోవాలని కోరారు. అదే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, డిపార్ట్‌మెంట్ విజయవంతంగా నిర్వహించాలని నారాయణ తెలిపారు. ముఖ్యంగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెల్లూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతి యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడినప్రతి కార్యకర్త కోసమే 10 కోట్ల సంక్షేమ నిధిని నా కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమాజంలో ప్రజలు ఎలా జీవిస్తున్నారో అన్న దానిపై తన సతీమణి, నా కుమార్తెలు, అల్లుళ్లకు కూడా పూర్తి అవగాహన వచ్చిందన్నారు. పార్టీ కోసం ఎవరైతే కష్టపడ్డారో వారందరూ కార్యకర్తలేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు

### రూ.30,55,976 ఆదాయం



**బుచ్చి మే 27 ప్రభాతవార్త** ప్రముఖపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానంలో సోమవారం హుండి లెక్కింపు నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవాదా య,ధర్మ దాయశాఖ అధికారులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండి లెక్కింపు నిర్వహించారు. 21.3.2024 నుండి 27.5.2024 వరకు 68 రోజులుకు గాను శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండిల ద్వారా వచ్చిన ఆదాయం 30,55,976 రూపాయాలు అని దేవాదాయ శాఖ అధికారులు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జె.వెంకటసుబ్బయ్య, సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వ హణా ధికారి,శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానం ,నెల్లూరు, దేవాదాయశాఖ కోవూరు ఇనస్పెక్టర్ఆర్కె చైతన్య, దేవస్థాన సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి విరుపార్ఘుల గిరికృష్ణ, స్థానిక ఏపిజి బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది మరియు విద్యాసాగర్ కృష్ణ,ఆద్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రిటైడ్ ఉద్యోగులు,భక్తులు తదితరులు పాల్గోన్నారు.

## వేదగిరి లక్ష్మి నరసింహస్వామి పూలంగి సేవ



**నెల్లూరు రూరల్, మే 27, ప్రభాతవార్త** నెల్లూరు జి ల్లా రూరల్ మండలం నరసింహకొండ పై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవ స్థానం నందు ఆదివారం పుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాలు ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగి శాయి. పుష్పయాగం సందర్భంగా స్వామి వారి వివిధ రకాల పుష్పాలతో పూజ చేసారు. పుష్పయాగం ఉభ యకర్తలుగా నెల్లూరు వాస్తవ్యులు గుంజి మురళికృష్ణ, కమల దంపతులు వ్యవహరించగా, ఏకాంత సేవకు ఉభయకర్తలుగా కీశే రావు సాహెబ్ విశ్వనాధ రావు కు టుంబ సభ్యులు వ్యవహరించగా పై పూజ కార్యక్ర మాలులో నిర్వహణాధికారి వి. గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన అధికారులకు, అన్ని శాఖల సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవ నాట్యమండలి వారిచే శ్రీ కృష్ణార్జున యుద్ధ సీమ, చెంచులక్ష్మి గిరిజన నాట్యమండలి వారి కామెడీ నాటకం భక్తులను అలరించాయి.

## ఎంతో కష్టపడ్డారు



**నెల్లూరు, మే 27, ప్రభాతవార్త - వైద్యం** జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎంతో కష్టపడ్డారని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ కొనియాడారు. జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో, నగరంలోని గోమతి నగర్‌లోని మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ క్యాంప్ కార్యాలయంలో, టిడిపి నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మే 13న జరిగిన ఓటింగ్ సరళిని నారాయణ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ బాగా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. మరో ఏడు రోజుల్లో కౌంటింగ్ జరగనుందని, దానిని దృష్టిలో ఉంచుకొని మన పార్టీ శ్రేణులందరూ జాగ్రత్తలు పాటిస్తూ, ప్రశాంతంగా ఉండాలని ఆయన సూచించారు. ఎందుకంటే వచ్చేది మన ప్రభుత్వమేనని వారికి నారాణ తెలియజేసారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, నగరాధ్యక్షుడు మామిడాల మధుతో పాటు నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 27 ప్రభాతవార్త :** కోవూ రులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్స వాల్లో భాగంగా సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అబిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. ఈ ఉత్సవాలను పురస్క రించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంతవైభవంగా అలంకరిం చారు .స్వామివారికి పూలంగిసేవ,పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలు గా ఇమిడిశెట్టి సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రుత్వికులుసుబ్బయ్యస్వామి,నందకుమార్ స్వామి,ఉన్నారు.

## జిల్లా ఎన్నికల అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్



**నెల్లూరు అర్బన్, మే 27, ప్రభాతవార్త** కేంద్ర ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా ఎన్ని కల కౌంటింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సం ఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ జిల్లా ఎన్ని కల అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించడానికి తీసుకోవాల్సి న చర్యలు పై కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికా రులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించ డానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌తో పా టు ఎన్నికల కమిషనర్లు గ్యానేష్ కుమార్, సుఖబీర్ సింగ్ పాల్గొన్నారు. నెల్లూరు కలెక్టరేట్ నుండి వీడి యో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం. హరినా రాయణన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పై శిక్షణ కార్యక్రమం




**నెల్లూరు అర్బన్, మే 27, ప్రభాతవార్త** పోస్టల్ బ్యాలెట్‌ల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ కౌంటింగ్ సిబ్బందికి చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పై కౌటింగ్ అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న పోస్టల్ బ్యాలెట్‌ల ఓట్ల లెక్కింపు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని ఆయన చెప్పారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సుమారు 24 వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయన్నారు. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్‌ను నిర్వహించడానికి 16 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్ నిర్వహించడానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్‌కు ఇద్దరు కౌంటింగ్ సూపర్వైజర్‌ను ఒక అసిస్టెంట్‌ను, ఒక మైక్రో పరిశీలకులను నియమించామన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌ను నిర్వహించాలని ఆయన తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో జి ల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న, నోడల్ ఆఫీసర్లు శ్రీనివాస్, టి బాపిరెడ్డి, షాలోమ్ రాజు, రామారావు కన్నమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్లను సందర్శించిన కలెక్టర్



నెల్లూరు అర్బన్, మే 27, ప్రభాతవార్త నగరంలో ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ ఎం. హరి నారాయణన్ పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే ఈవిఎం గోడౌన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా గోడౌన్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ మలోల, తహశీల్దార్ సుబ్బారెడ్డి ఉన్నారు.

## చిన్నారుల విజ్ఞానానికి గ్రంథాలయం



**నెల్లూరు రూరల్, మే 27, ప్రభాతవార్త** నేటి బాలలే రేపటి పౌరులు చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు గ్రంథాలయంలో చిల్డ్రన్స్ లైబ్రరీ ప్రారంభించినట్లు మేరీగ్రేస్ తెలిపారు. విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం, కథలు చెప్పడం, బొమ్మలు వేయడం లాంటి విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేవిధంగా ప్రతి విద్యార్థికి నెల్లూరు ఏకె నగర్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని గ్రంథాలయ ఇన్‌చార్జ్ వి. మేరీ గ్రేస్ తెలిపారు.

## కౌంటింగ్ విధివిధానాలపై శిక్షణ

**కావలి, మే 27 ప్రభాతవార్త :** జూన్ 4వ తేది జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విధివిధానాలపై కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శీనానాయక్ మాట్లాడారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను చిత్తశుద్ధితో, అంకితభావంతో నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ విధివిధానాలపై ఆయన అవగాహన కల్పించారు. కావలి నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల కౌంటింగ్ విధివిధానాలపై అందరికి అర్ధమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో కావలి తహశీల్దార్ నగేష్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, నియోజకవర్గంలోని తహశీల్దార్లు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




## నేటి నుండి కలువాయమ్మ సన్నిదిలో పోలేరమ్మకు సద్దిసమర్పణ



కలువాయి మే 27 ప్రభాతవార్త గ్రామ శక్తి స్వరూపిణి శ్రీకలువాయమ్మ అమ్మవారి సన్నిధిలో నేటి నుండివారం రోజులుపాటు పోలేరమ్మకు సద్ది సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే సాంద్రాయ బద్ధంగా దేవస్థానం ప్రాగంణంలో చల్ల బానాలను ఏర్పాటు చేయడంతో గ్రామంలోని భక్తులందరు ఇంటి వద్ద నుండి భక్తి శ్రద్దలతో సద్దిని తీసుకొని వచ్చి చల్లబానాలలో సమర్పించడం అనవాయితీ అని నిర్వాహకులు తెలిపారు. నూకలమ్మ,ఆటలమ్మ, పెద్ద అమ్మవార్లు ప్రబలుతున్న సమయంలో గ్రామంలో చల్లన్నం,రాగి అంబళి వంటి పదార్థాలను వారాలు పాటు అమ్మవారికి సమర్పించే ప్రక్రియే సద్ది సమర్పణ అని ఆలయ అర్చకులు తెలిపారు. ఇటువంటి సందర్భాలలో గ్రామ దేవతల ఆలయాల వద్ద చల్లబానలు ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలు ఇంటి వద్ద నుండి పసుపు, కుంకుమ వేపమండలతో అలంక రించిన పాత్రలతో అమ్మవారిని కీర్తిస్తు సద్దిని తీసు కొని వచ్చి బానలలో సమర్పిస్తారు. ఈప్రక్రియలో అమ్మవారికి సమర్పించడం వల్ల అమ్మవారు శాంతించి అంటువ్యాధులను అరికట్టి భక్తులను చల్లచూస్తుందని పూర్వికుల నమ్మకమని,అనాధిగావస్తున్న ఇటువంటి సాంప్రదాయాలు అందరికి విశ్వసమని తెలిపారు.ఉదయం 6గంటలనుండి 8గంటల వరకు ఈ కార్యక్రమంకొనసాగుతుందనినిర్వాహకులు తెలిపారు

## బ్రహ్మోత్సవాల తాత్కాలిక హుండీల ద్వారా రూ.33,76,445 రాబడి



పెంచలకోన(రాపూరు),మే27ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల (క్లాత్)ద్వారా రూ.33,76,445 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కె.విజయసాగర బాబు తెలిపారు.సోమవారం జరిగిన బ్రహ్మోత్సవాల హుండీల లెక్కింపు కార్యక్రమంలో మే నేల 19 వ తారీఖు నుండి మే 25 వ తేది వరకు స్వామి వారికి భక్తులు తాత్కాలిక హుండీలలో సమర్పించిన మొత్తాన్ని లెక్కించగా ఈ మొత్తం వచ్చినట్లు తెలిపారు.దీంతో పాటు మిక్స్‌డ్ బంగారు ఆభరణాలు000.44.090 గ్రాములు,మిక్స్‌డ్ వెండి ఆభరణాలు కెజీ 003.900,000 గ్రాములు, వచ్చినట్లు తెలిపారు.గత ఏడాది బ్రహ్మోత్సవాలలో హుండీ ద్వారా రూ.24,26,782 రాగా ఈ ఏడాది రూ.9.49,663 ఆధనంగా హుండీ ద్వారా వచ్చినట్లు తెలిపారు. ఈ హుండి లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన ఆర్చకులు రామయ్య స్వామి,పెంచలయ్య స్వామి,హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా జిల్లా దేవాదాయ శాఖాధికారి జె.శ్రీనివాస రావు,చెంగాళమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర రావు, పెంచలకోన ఔట్ పోస్ట్ సిబ్బంది, ఎపిజిబి బ్యాంకు సిబ్బంది, పాల్గోన్నారు. హుండీ ద్వారా వచ్చిన మొత్తాన్ని పెంచలకోనలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి



**బిట్రగుంట, మే 27 ప్రభాతవార్త :** బోగోలు మండలంలో వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి ఎద్దడికి గ్రామాలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి సభ్యులు మండల అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపిపి మేకల సుజాత అధ్యక్షతన సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్బంగా పలువురు సభ్యులు గ్రామాలలో తాగునీటి చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయని వాటిని తక్షణమే రిపేర్లు చేసి తాగునీటి ఇబ్బంది లేకుండా చేయాలని సభ దృష్టికి తెచ్చారు. దీనిపైన ఎంపిడివో జమీవుల్లా జోక్యం చేసుకుంటూ గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏఏ గ్రామాలలో ఎన్ని తాగునీటి చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి, తాగునీటి పథకాలకు సంబంధించిన మోటార్లు పనిచేస్తున్నాయా లేదా, విద్యుత్ సరఫరాలో అవాంతరాలు వున్నాయా వంటి వాటిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో కొన్నిచోట్ల కలుషిత నీటితో ప్రజలు అస్వస్తతకు గురవుతున్నారని అలాంటివి లేకుండా తాగునీటి ట్యాంకులన్నింటిని క్లోరినేషన్ చేయాలని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో వుండటంతో తాగునీటి సమస్య మాత్రమే సమావేశంలో చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, నాగులవరం సొసైటీ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రినాయుడు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.గోవిందరావు, డిప్యూటీ తహాశీల్దార్ జులియాబాయి, పలు శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## ముంగమూరులో భూసార పరిరక్షణపై అవగాహన



**బిట్రగుంట, మే 27 ప్రభాతవార్త :** బోగోలు మండలం ముంగమూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సి.హెచ్.నాగరాజు రైతులకు భూసార పరిరక్షణ, భూసార పరీక్షలు, వాటి వల్ల ఉపయోగాలు, భూసారాన్ని ఎలా పెంపొందించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి ఎస్.విజయలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## గ్రామాలలో కొనసాగుతున్న పోలీస్ సోదాలు



**బిట్రగుంట, మే 27 ప్రభాతవార్త :** వచ్చే నెల 4వ తేదిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్బంగా గ్రామాలలో ఎలాంటి అల్లర్లు సృష్టించకుండా ప్రతి ఇంటిలో మారణాయుధాలు వంటివి వున్నాయనే ఉద్దేశంతో చేపట్టిన పోలీస్ సోదాలు కొనసాగుతున్నాయి. బోగోలు మేజర్ పంచాయతీలో అరవపాళెం, బృందావనం ప్రాంతాలలో ఆదివారం రాత్రి కావలి రూరల్ సిఐ బి.నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులతో పాటు బిఎస్ఎఫ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సరిగా లేని వాహనాలను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ భోజ్య, అల్లూరు, దగదర్తి, బిట్రగుంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

**కావలి రూరల్, మే 27 ప్రభాతవార్త :** సమాజంలో ఆరోగ్యమే మహాభాగ్యంగా ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించాలని సామాజిక ఉద్యమ కార్యకర్త యం.మాలకొండారెడ్డి తెలిపా రు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రభుత్వాలు, అధికారులు, పౌరసంస్థలు నిరంతరం చైతన్యపరచాలని కోరారు. వైద్యం ఎంతో ఖరీదైన పరిస్థితులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ప్రభుత్వ వైద్యశాలలు నిరంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి డబ్ల్యుహెచ్‌వో సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు.



## ఉలవపాడు గ్రంథాలయంలో ఖోఖో పోటీలు



**ఉలవపాడు, మే 27, ప్రభాతవార్త :** ఉలవపాడు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంధాలయంలో పాఠశాల విద్యార్థులతో ముందుగా పుస్తక పఠనం చేపించి తరువాత శారీరక, మానసిక ఆనందం కోసం ఖోఖో పోటీలు నిర్వహించారు. చివరిగా ఎండల్లో ఆటలు ఆడి అలసిపోయిన పిల్లలకు దాత దాసరి సుజాత శీతల పానియాలు ఇప్పించి పిల్లల ప్రేమకు పాత్రులయ్యారు. సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

## పైప్‌లైన్ లీకేజీపై అప్రమత్తమైన అధికారులు



**కోవూరు, మే 27 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని చెర్లో గాంధీ సంఘం ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. వెంటనే సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులను చేపట్టేలా తగు చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంత గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వండి



**కోవూరు, మే 27 ప్రభాతవార్త :** సెల్‌ఫోన్ లోకం నుంచి బయటకు వచ్చి పుస్తక పఠనానికి విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని జనవిజ్ఞాన వేదిక నేత భాస్కర్ పేర్కొన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం , తదితర అంశాలపై విద్యార్థులకు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ బాండాగారి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ వేసవి సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించడానికి ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువ మంది విద్యార్థులు తమ సమయాన్ని సెల్‌ఫోన్‌తో గడపడం మంచిది కాదన్నారు. దానిని విడనాడి గ్రంథాలయంలో ఉన్న పురాతన చరిత్రలు, మహనీయుల పుస్తకాలను అవగతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్కే రంతుల్లా, తదితరులు ఉన్నారు. పలు సైన్స్ ప్రయోగాలు చేసి విద్యార్థులను అలరింపజేశారు.

## తాగునీటి సమస్య తీర్చాలంటూ జడ్‌పి సిఇఓ,డిపిఓకు గ్రామస్తుల వేడుకోలు

**రాపూరు, మే27, ప్రభాతవార్త :** తమ గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని మండల కేంద్రమైన రాపూరు పంచాయితీ పరిధిలోనిరామిరెడ్డిపల్లి గ్రామస్తులు సోమవారం జిల్లా పరిషత్ సిఇఓను,జిల్లా పంచాయితీ అధికారిని కోరారు. తమ గ్రామంలోతాగేందుకు వున్న రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామరక్షిత మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నామన్నారు.దీనిపై ఎన్ని సార్లు పంచాయితీ కార్యదర్శిని కలసినా పంచాయితీలో నిధులు లేవని తాము ఏమి చేయలేమంటూచెపుతున్నారన్నారు. మీరైనా స్పందించి తమకు తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరడంతో వెంటనే స్పందించినజిల్లా పరిషత్ సిఇఓ చరవాణి ద్వారా రాపూరు మండల ప్రజా పరిషత్ అధికారికి రాపూరు మేజర్ పంచాయితీ పాలకవర్గం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు పంచాయితీకి విడుదలైన నిధులు, వాని వినియోగానికి సంబందించినపూర్తి వివరాలను నివేధిక రూపంలో ఆందజేయాలని ఆదేశించనట్లు రామిరెడ్డిపల్లి గ్రామస్థులు తెలిపారు. జిల్లా పరిషత్ పంచాయితీ అధికారిణి పంచాయితీ కార్యదర్శికి ఫోన్ చేసి వెంటనే రామిరెడ్డిపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం మోటరు మరమత్తులు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించి గ్రామస్తులకు తాగునీరు అందించాలని, అప్పటి వరకు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ఎన్టీఆర్ జయంతి వేడుకల్ని జయప్రదం చేయండి

**కావలి, మే 27 ప్రభాతవార్త :** యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు తెలిపారు. కావలి ముసునూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం 9 గంటలకు టిడిపి కావలి అసెంబ్లీ అభ్యర్ది కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ ప్రారంభం



**కావలి రూరల్, మే 27 ప్రభాతవార్త :** 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ డాక్టర్ సుశీల్‌కుమార్ ప్రియ తెలిపారు. మొదటి రోజు 20 మంది విద్యార్థులు తమ సర్టిఫికేట్లలను ధృవీకరించడం జరిగింది. ఈ విద్యార్థులు 1వ ర్యాంక్ నుండి 12000 ర్యాంక్ పరిధిలో వున్నారని తెలిపారు. మొదటి ఐసిఆర్ ఫారంను 1220 ర్యాంక్ సాధించిన సురేంద్రకు కోఆర్దినేటర్ సుశీల్‌కుమార్ ప్రియ అందజేశారు.

## పేదలకు శ్రీనాధ్ రెడ్డి ఆర్ధిక సాయం



**మనుబోలు, మే 27, ప్రభాతవార్త :** శ్రీసేవానాధం ట్రస్టు ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి నాలుగు కుటుంబాలకు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. వీరిలో గిరిజన కాలనీకి చెందిన పాముల శ్రావణి తన భర్త అనారోగ్యంతో చనిపోయాడు. కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో ఈ సమాచారం తెలుసుకున్న శ్రీనాథ్‌రెడ్డి రూ.50వేలు నగదు ఆ కుటుంబానికి ఇచ్చి ధైర్యం చెప్పారు. అదే కాలనీకి చెందిన గునపాటి ఏడుకొండలు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒక కన్ను కోల్పోయాడు. ఈ విషయంపై స్పందించిన శ్రీనాథ్‌రెడ్డి ఏడుకొండలకు రూ.10వేలు అందజేశాడు. అదే విధంగా అంబేద్కర్‌నగర్‌కు చెందిన గుర్రం పోలమ్మ, భర్త పెంచలయ్య చనిపోయాడు. ఇద్దరు కూతుర్లకు భర్తలు లేరు. కూతుర్ల బిడ్డల యొక్క చదువుల కోసం, వారి కుటుంబ పోషణ కోసం శ్రీనాథ్‌రెడ్డి రూ.50వేలు నగదు ఇచ్చారు. అలాగే బేల్దారి పనులు చేస్తూ జారిపడి మెడవిరిగిపోయిన సురేంద్రకు శ్రీనాథ్‌రెడ్డి రూ.10వేలు ఇచ్చి ఆదుకున్నాడు. ఈ విధంగా సోమవారం రోజు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి రూ.1.20లక్షలు ఆర్థిక సాయం నాలుగు కుటుంబాలను ఆదుకుని పలువురి చేత మన్ననలు పొందారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి చేసిన ఆర్థిక సాయానికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన మేలు మరచిపోలేమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, సేవానాధం ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## 104 సేవలను సద్వినియోగం చేసుకోండి



**చేజర్ల , మే 27 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే 104 వైద్యసేవలను ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేజర్ల వైద్యాధికారిణి డాక్టర్ మొహతాబ్ పేర్కున్నారు .ఈ సందర్భంగా మండలంలోని తూర్పు కంభంపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతు వైద్యసేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 104 వైద్యశిబిరంలో అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



**నెల్లూరు,మే 27, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన అన్నా రెడ్డిపాలెం గ్రామంలో ఆర్‌బికే కార్యాయలం నందు రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణమయ్య కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి రావడం జరుగుతుంది పురుగు మందుల విషయంలో వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకుని సంబంధిత పురుగు మందులను వాడడం వలన వరి పంట క్రమ పద్ధతిలో రావడం జరుగుతుంది. రైతులు ఎలాంటి అపోహాలకు వినకుండా వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే పంటలు అధిక దిగుబడులో వస్తాయి రైతుల లబ్ది పొందుతారు అన్నారు. అదే విధంగా ఖళీగా ఉన్న ప్రతి రైతు ఖాళీగా ఉన్న వరి పంట పొలాల్లో తప్పనిసరిగా పచ్చి రొట్టె ఎరువుల ను వేయాలని రైతులకు తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్క రైతు కచ్చితంగా డి ఎ పి, యూరియా ను పంట సాగుపై తప్పనిసరిగా వాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వి ఏ లు తదితరులు పాల్గొన్నారు

## లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో ఆద్వర్యంలో కంటి ఆపరేషన్లు



**కలువాయి మే 27 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆప్ నెల్లూరు వారి ఆద్వర్యంలో కలువాయిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో సుమారు 150 మంది రోగులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపీణి చేశారు. అదే విధంగా నెల్లూరు పిఎల్‌రావు హాస్పటల్ నందు 6 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆప్ నెల్లూరు పిఒరామ్ చారిటబుల్ ట్రస్టు ,మోడరన్ ఐ హాస్పటల్, నారాయణ డెంటల్ కాలేజి సహకారంతో నిర్వహించిన ఈకార్యక్రమానికి గ్రామంలో విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి కామిశెట్టి వెంకటేశ్వర్లు, కృష్ణం హజరత్‌బాబులు సహకారం అందించగా డాక్టర్లు వైద్యసిబ్బంది బివిఎన్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు నిర్వహించిన. వైద్యపరీక్షలు నిర్వహించారు.

# వృద్దుల, దివ్యాంగుల పింఛన్లు బ్యాంకులకు వేయవద్దు



**కావలి, మే 27 ప్రభాతవార్త :** వృద్దులు, దివ్యాంగుల పింఛన్లు బ్యాంకులకు వేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా మల్లి మాట్లాడారు. ఈ నెల 1వ తేదిన వృద్దులు, దివ్యాంగుల పింఛన్లు బ్యాంకులకు వేసి సామాజిక పింఛనుదారుల్ని ఇబ్బందిపెట్టారని తెలిపారు. 75 శాతం బ్యాంకుల నుండి పింఛను పొందలేదన్నారు. బ్యాంకులలో పింఛను వేయడం వల్ల అకౌంట్లు లావాదేవీలు చేయకపోవడంతో వృద్దులు ఇబ్బందులు పడ్డారన్నారు. పింఛను కోసం నడి ఎండలో చిత్రహింసలకు గురయ్యారని తెలిపారు. బ్యాంకులో సరైన అమౌంట్ లేదని కెవైసి చేయించాలని ఆధార్, పాన్‌కార్డులు కావాలని పింఛనుదారులను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. బ్యాంకుల నియమాలు పాటించాలంటే ఒక్కరికి కూడా పింఛను రాదన్నారు. బ్యాంకుల చుట్టు తిరిగినా ఇప్పటి వరకు పింఛను ఇవ్వలేదన్నారు. ఎట్టి పరిస్థితులలో 1వ తేది ఇచ్చే సామాజిక పింఛన్లు బ్యాంకులకు వేయవద్దన్నారు. సచివాలయ ఉద్యోగస్తులు 12 మంది వున్నారని వారి ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో వేసిన డబ్బులను ప్రభుత్వానికి పంపించాలన్నారు. 1300 కోట్ల రూపాయలలో 800 కోట్ల రూపాయలు బ్యాంకులు జమ చేసుకున్నాయన్నారు. బ్యాంకులపై చర్యలు చేపట్టాలన్నారు. వృద్దాప్య పింఛన్లు గతంలో ఇచ్చిన మాదిరిగానే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు మోహన్‌రావు, జెడ్డా వాసు, తిరుపతిలు పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజా అవరోహణ





**కోవూరు, మే 27 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలముగింపు సందర్భంగ సోమవారం ధ్వజా అవరోహణ కా ర్యక్రమాన్ని సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామివారికి. ఆలయ ప్ర ధాన రుత్వికులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా హో మం కార్యక్ర మం ఏర్పాటు చేసి పూజలు.అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**ఉలవపాడు, మే 27, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉలవపాడులోని ప్రభుత్వ హైస్కూల్ నందు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎంవీవీ ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు పాఠశాలల వంటవారికి మరలా పాఠశాలల పున:ప్రారంభం దృష్ట్యా జాగ్రత్తలు, సూచనలు మండల విద్యాశాఖాధికారి-2 పీవీ రమణయ్య సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఎంఈఓ-2 పీవీ రమణయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచిగా నాణ్యతగా వండాలని ప్రభుత్వం చెప్పిన మెనూ పాటించాలని పిల్లలందరూ 100శాతం భోజనం తినాలని కోరారు. వంట గదులు పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేశారు. ట్రైనింగ్ సిబ్బంది, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సలీం భాష, సీఆర్పీలు ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించాలి



**కోవూరు, మే 27 ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా ప్రశాంతంగా సజావుగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరిగేందుకు సహకరించాలని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి , జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అన్నారు. కోవూరులోని ఆర్వో కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి తరఫున ప్రధాన ఏజెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన సమాచారం కూడా ప్రధాన ఏజెంట్లకు అందజేయడం జరుగుతుందని , దీని ప్రకారం వారు కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. అదేవిధంగా ప్రతి రాజకీయ పార్టీ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ ఏజెంట్ల ఎంపికను కూడా పారదర్శకంగా ఎటువంటి నేరచరిత్ర కలిగిన వారిని ఎంపిక చేయరాదన్నారు. ఈ సమీక్షలో ఏఈఆర్వోలు కోవూరు తహసీల్దార్ విజయశ్రీ, ఇందుకూరుపేట తహసీల్దార్ రమేష్, విడవలూరు తహసీల్దార్ శ్రీనివాసులు, అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి తరపున చీఫ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించిన మలిశెట్టి



**కావలి, మే 27 ప్రభాతవార్త** చంద్రగిరి నియోజ కవర్గ తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పులివర్తి నానిని కావలి వ్యవసాయ మార్కెట్ కమి టీ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ నెల 14వ తేది కొంతమంది వైసిపి నాయకులు పులివర్తి నానిపై దాడి చేయడంతో ఆయన తీవ్ర గాయాలపాల య్యారు. సోమ వారం పులివర్తి నాని నివాసానికి మలిశెట్టి వెంకటేశ్వర్లు వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ఏటీఎంలో చోరీ

నెల్లూరు క్రైం, మే 27, ప్రభాతవార్త నగరం శివారులోని పడారపల్లిలో ఓ జాతీయ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు స్థానిక పడారుపల్లి సమీపంలోని ఓ జాతీయ బ్యాంకు ఏటీఎంలో తెలియని దుండగులు ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 2.45 లక్షల మేర నగదు చోరీకి గురైనట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న వేదయపాలెం సిఐ వెంకటనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## వైభవంగా తిర్చి ఉత్సవం





కోవూరు, మే 27 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న కోదండరామ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్స వాల ముగింపు సందర్భంగా సోమవారం ప్రాత:కాలమునే స్థానిక వీరాంజ నేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో స్వామివారికి తిర్చి ఉత్స వం , అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అభిషేక కార్యక్రమాలను కనులారా చూశారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా కె. శ్రీనివాసరావు, వెంకట పావని, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

**వైభవంగా చక్రస్నానం** ఈ సందర్భంగా స్వామివారికి స్థానిక వీరాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో చక్రస్నాన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన రుత్వికులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు స్వామివారి చక్రస్నానం అభిషేక తీర్థాలను వారి శిరస్సు పై చల్లారు. మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూసార పరిరక్షణ పై అవగాహన



పొదలకూరు, మే 27,ప్రభాతవార్త పొదలకూరు మండలంలోని దేగపూడి గ్రామంలో భూసార పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయాధికారి గీతా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని నివేదిక ఆధారంగా సూచించిన మోతాదు మేరకు పంటలకు ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు. భూమిలో సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు అనగా జీలుగలు, జనుములు, పిల్లిపేసర్లు వంటి విత్తనాలు 50 శాతం రాయితీ పై రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు తీసుకుని పంట పొలాలలో సాగుచేసుకుని భూసారాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం వుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంకు దేగపూడి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సేవికా సమితి మాతృమూర్తుల పథ సంచలనం (రూట్‌మార్చి)







బుచ్చి మే 27 ప్రబాతవార్త మాతృమూర్తులలో దేశభక్తి, సనాతన హిందూధర్మం,సంస్కృతి పట్ల అవగాహన కల్పించుటకొరకు సోమవారం బుచ్చిరెడ్డిపాళెం పురవీదులలో ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగం " రాష్ట్ర సేవికా సమితి " నేతృత్వంలో మాతృమూర్తుల పథసంచలనం (రూట్‌మార్చి) జరిగింది. కోదండరామస్వామి ఆలయం వద్ద నుండి ప్రారంభం అయిన పథసంచలన కార్యక్రమం మూడు లాంతర్లసెంటర్, కొత్తబస్టాండ్, బిజెపి కార్యాలయం, పార్క్‌సెంటర్, మమతా నర్సింగ్‌హోమ్‌సెంటర్, గిరిజాహాల్‌సెంటర్, శ్రీరామక్లాత మార్కెట్ సెంటర్, పెద్దబస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్,అపస్ కార్యాలయం సెంటర్,శ్రీరామనగర్ మీదుగా సాగింది. అనేకమంది స్దానిక మహిళలు పథసంచలన చేస్తున్న మాతృమూర్తులకు పూలు జల్లుతు ఘన స్వాగతం పలికారు. బుచ్చిరెడ్డిపాళెం చరిత్రలో తొలిసారిగా మాతృమూర్తుల పథసంచలనం జరగడం ఇదే మొదటి సారి. మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వారు తమ బిడ్డలకు భారతదేశం యొక్క ఔనత్యం గురించి తెలియజేసి వారిలో దేశభక్తి ఇనుమడింప చేయాలన్న లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సేవికాసమితి అఖిల బారత ప్రముఖు కార్యహిక అన్నదానం సీతగాయత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంచాలక డాక్టర్ సోమేశ్వరీ, ప్రాంత కార్యవాహిక వెంకటభాను, ప్రాంత శారీరక్ ప్రముఖ్ లింగం ఉజ్జ్వల,వర్గ సర్వాధికారి కుమారి కృష్ణ వేణి, వర్గ కార్యవాహిక సన్నారెడ్డి మధుకుమారిమహిళా ప్రముఖు మధుల,లక్ష్మీ, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ బాలు సుబ్బారావు, కెశవయ్య, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీదర్‌రెడ్డి, నేలనూతల శ్రీదర్, బిజెపినాయకులు కాసా శ్రీనివాసులు, చేవూరు వినయ్‌నారాయణ, మాచవరం శ్రీనివాసులు,ఇనుగూరు బాలయ్య, ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు ,బిజెపినాయకులు,పెద్దఎత్తున పాల్గోన్నారు.

## విచ్చలవిడిగా బెల్టు షాపులు



**ఉలవపాడు, మే27, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా బెల్టు షాపులు విరాజిల్లుతున్నాయి. మండల పరిధిలోని కొల్లూరుపాడు సమీపంలో దాదాపుగా నాలుగు బెల్టు షాపులు, ఉలవపాడు రైల్వేస్టేషన్ వద్ద ఐదు షాపులు, రిజర్వులో మూడు ఎస్సీ కాలనీలో ఆరు షాపులు, ఎస్టి 8షాపులు, వినాయకుడి గుడి దగ్గర నాలుగు షాపులో యధేచ్చగా నడుపుతున్నారు. బహిర్గతంగా మద్యం అమ్ముతున్న కానీ అదికారులు నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహారిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉలవపాడు మండలంలో నాలుగు మద్యం షాపులు ఉండగా, మద్యం షాపులలో లేని బ్రాండ్లు బెల్టు షాపులలో దొరకడం గమనార్హం. 150 రూపాయలు గల ఒక్కొక్క మద్యం బాటిల్‌ను బెల్టు షాపులలో 250 రూపాయలకు అమ్ముతూ మద్యం ప్రియుల రక్తం పిలుస్తున్నా కాని కళ్ళు లేని కబోదులుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు వారి అవినీతికి అద్దం పడుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం బెల్టు షాపులలో బహిర్గతంగా అమ్ముతున్నా కానీ సంబంధిత అదికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని స్థానిక ప్రజలు అంటున్నారు. ఉలవపాడు రైల్వే స్టేషన్ వద్ద నాలుగు బెల్టు షాపులు నడుస్తుండగా బైపాస్ ఏరియాలో 10, రాజుపాలెంలో ఐదు బెల్టు షాపులు నడుస్తుండగా అవేమి అధికారులకు ఎందుకు కనపడటం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అన్ని తెలిపిన అధికారులు దాడులు చేయకపోవడం ప్రశ్నార్ధకంగా మారుతుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టు షాపులకు మద్యం ఎక్కడ నుండి వస్తుంది. ఎవరు మద్యం ఇస్తున్నారు. అన్న కోణంలో విచారణ జరపాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## మోటారు సైకిల్, లారీ ఢీ.. యువకుడు మృతి



మనుబోలు, మే27, ప్రభాతవార్త చెన్నై-కలకత్తా 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం మోటారు సైకిలర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్ నడుపుతున్న బి.కార్తీక్(30) మోటారు సైకిల్ వెనుక కూర్చొన్న అరవింద్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరిని నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చేర్పించగా కార్తీక్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. నెల్లూరుకు పనిమీద వచ్చిన కార్తీక్, అరవింద్ మోటారు సైకిల్‌పై గూడూరి వైపు వెళ్తున్నారు. పొదలకూరు నుండి వీరంపల్లి రోడ్డులో వేబ్రిడ్జి దగ్గరకు వెళ్తున్న లారీ వీరి మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటారు సైకిల్ నుజ్జునుజ్జు అయి కార్తీక్, అరవింద్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ కార్తీక్ అపోలో చనిపోయినట్లు తెలిపారు. అరవింద్‌కు తీవ్ర గాయాలు తగిలాయని పోలీసులు వివరించారు. మృతదేహం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రేన్ ఢీకొని వృద్ధురాలు మృతి



సైదాపురం, మే27, ప్రభాతవార్త మండల కేంద్రమైన సైదాపురంలో క్రేన్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సైదాపురంలోని వేములచేడు రోడ్డు సమీపంలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సైదాపురం అరుంధతివాడకు చెందిన మల్లారపు పోలమ్మ(74) రోడ్డుపై నడుస్తూ తమ ఇంటికి వెళ్తున్న క్రమంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన గోడపత్ని నరేష్ అనే యువకుడు క్రేన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం నిర్లక్ష్యంగా క్రేన్ నడుపుతూ పోలమ్మను ఢీకొనడంతో ఆమె టైరు క్రింద పడి నలిగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నెలకొంది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతికి కారణమైన నరేష్‌ను అదుపులోకి తీసుకుని క్రేన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



అనుమసముద్రంపేట,మే27,ప్రభాతవార్త : ఏఎస్‌పేట మండలం హసనాపురం గుండం మెట్ల వద్ద కరెంటు పనులు చేస్తున్న వ్యక్తికి విద్యుత్ షార్ట్ సరూ క్యుట్ వలన ప్రమాదానికి గురయ్యాడు. వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు సంగంకు చెందిన చిట్టమూరు వినోద్925) కరెంట్ పనులు చేసేందుకు హసనాపురం వెళ్ళాడు. అక్కడ పనులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న వినోద్‌ను ఆత్మకూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడని తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**నెల్లూరు, మే 27, ప్రభాతవార్త - వైద్యం** నగరంలో పలు రకాల మరమ్మత్తుల కారణంగా 33/11 డిఎస్‌ఆర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి గౌతమి నగర్ ఫీడర్‌లో కొత్త ట్రాన్స్ఫార్మర్ (ఇంప్రూవ్మెంట్ ట్రాన్స్ఫార్మర్) ఏర్పాటు కారణంగా నేతాజీ నగర్, ఎస్‌బిఐ కాలనీ, వాటర్ ట్యాంక్ డౌన్ తదితర ప్రాంతాలలో ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాని మంగళవారం నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరఉ టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఏ. సోమశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.